క్లుప్తంగా

31తో నవోదయ దరఖాస్తు గడువు పూర్తి

పరవాడ: నవోదయ ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 31వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి సునీత ఒక ప్రకటనలో కోరారు. నవోదయ ప్రవేశ పరీక్షకు 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. ఆన్‌లైన్ చేయడానికి ఆధార్ కార్డు, ఫొటో, విద్యార్థి సంతకం, తల్లి/తండ్రి సంతకం ఉండాలని తెలిపారు. దరఖాస్తు నవోదయ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. ఏప్రిల్ 29న పరీక్ష ఉంటుందని ఎంఈవో సునీత పేర్కొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరస్వామికి విశేషంగా అభిషేకాలు



సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



స్వామికి హారతి అందజేస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అట్టహాసంగా తీర్థాలు



సబ్బవరం: మండలంలోని మొగలిపురం,గాలిభీమవరం,పైడివాడ గ్రామాల్లో సీతారాముల తీర్థ మహోత్సవాలు, అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారంలో బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల తీర్థమహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భారీ అన్నసమారాధన



వడ్డన చేస్తున్న చందుయాదవ్ తదితరులు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో పైడితల్లి అమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు, మహిళలు తరలివచ్చి అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు చందు యాదవ్, పిల్లల అప్పలరాజు, ఎలమంచిలి అప్పలరాజు, ఎలమంచిలి శ్రీను, చీర అప్పలరాజు, ఆబోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

విశాఖ లీగల్ : మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో మహిళా చట్టాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం-1994పై ఆయన మాట్లాడారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరు సమానమేనని కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. వివాహితులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

ప్రభుత్వ పథకాలే శ్రీరామరక్ష

ఎమ్మెల్యే అదీప్‌రాజు



పథకాల లబ్ధి వివరాలతో కూడిన బ్రోచర్ మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజు

అగనంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్షగా నిలుస్తాయని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు అన్నారు. 79వ వార్డు లంకెలపాలెం వార్డు సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు ఏమేరకు లబ్ధి జరిగిందో గణంకాలతో సహా వివరించారు. వివిధ కారణాల వల్ల అర్హత ఉండి ప్రభుత్వ పథకాలకు నోచుకోనివారికి తక్షణం సహాయం చేయడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటి రుణాలు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, సమయానుకూలంగా నీరు విడుదల చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అన్నంరెడ్డి అజయ్‌రాజు, అప్పికొండ మహలక్ష్మినాయుడు, జి.పూర్ణానందశర్మ, ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు, కింతాడ ఈశ్వరరావు, కర్రి నరసింగరావు, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఘాట్ రోడ్డు పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి రోడ్డు ఫార్మేషన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రికి పంచవటి ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు సహకారంతో ఏర్పాటు చేస్తున్న రెండో ఘాట్‌రోడ్డు పనులు సోమవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తరాంధ్ర తిరుపతిగా పెందుర్తి వెంకటాద్రి విరాజిల్లుతోందన్నారు. ప్రముఖ ఉత్సవాలు, పర్వదినాల్లో వేలాదిమంది భక్తులు వెంకటాద్రికి రావడంతో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కేవలం వెళ్లి వచ్చేందుకు ఒక రోడ్డు మాత్రమే ఉందని.. దాంతో రెండో ఘాట్‌రోడ్డు పనులకు దాతలు శ్రీకారం చుట్టారన్నారు. గ్రావెల్ లెవెల్ చేసి తొలుత కచ్చా రోడ్డు ఫార్మేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఆపనులు పూర్తవగానే బీటీ లేదా సీసీరోడ్డు పనులు జరుగుతాయన్నారు. తనవంతు సహకారం కూడా అందిస్తానని తెలిపారు. అర్చకులు ఎమ్మెల్యేకి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నతుడు సుభాష్ చంద్రబోస్



సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజేంద్రప్రసాద్ తదితరులు



పాత పెందుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ..

సింహాచలం: క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన మహోన్నతుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని అడవివరం గ్రంథాలయ రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ కొనియాడారు. సుభాష్ చంద్రబోస్ 125వ జయంతి పురస్కరించుకుని సోమవారం అడవివరం గ్రంథాలయంలో చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో సుభాష్‌చంద్రబోస్ పోషించిన పాత్ర ఎంతో గొప్పదన్నారు. సైన్యాధ్యక్షుడిగా ఆయన నిర్వర్తించిన విధులు స్ఫూర్తిదాయకమైనవని కొనియాడారు. రచయిత సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రేడియో ప్రసంగాలతో యావత్ భారతదేశాన్ని ఆవేశంలో ముంచెత్తిన ఘనత సుభాష్‌చంద్రబోస్‌దని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, పాఠకులు నాగరాజు, వనజ, దివ్య, వరలక్ష్మి, ఏడుకొండలు, మధు, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ పాల్గొన్నారు.

పెందుర్తి పాఠశాలలో..

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

పార్టీ విజయానికి కృషి



సన్యాసిరావు

పరవాడ: మండలంలో పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని పరవాడ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, వెన్నలపాలెం గ్రామ ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు అన్నారు. తనను మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌గా నియమించినందుకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

కళ్లద్దాల పంపిణీ



వృద్ధులకు కళ్లద్దాలు అందజేస్తున్న అర్జున్

పరవాడ: అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని ట్రస్టు వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున్ పిలుపునిచ్చారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వృద్ధులకు సమకూర్చిన కళ్లద్దాలను వాడచీపురుపల్లిలో సోమవారం ట్రస్టు వైస్ చైర్మన్ అర్జున్ సోమవారం వృద్ధులకు అందజేశారు.

కార్మిక గర్జనకు మద్దతుగా దీక్ష



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

సింహాచలం: అనేక మంది ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, దాన్ని ప్రైవేటు పరం చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టాలని రాజకీయ, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 30న జరిగే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పెందుర్తి కూడలిలో సంఘీభావ దీక్ష జరిగింది. సీపీఎం, టీడీపీ, సీపీఐ ఎంఎల్(ఎన్‌డీ)తదితర పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. విశాఖ ఉక్కు మనందరి హక్కు అని, ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుందాం అని, బీజేపీ ప్రైవేటీ కరణ విధానాలను తిప్పికొడదామని నినదించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటన చేసి ఈనెల 27వతేదీకి రెండేళ్లు అవుతోందని, ఈతరుణంలోనే జనవరి 30న విశాఖ ఉక్కునగరంలో కార్మిక గర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని ప్రలంతా కార్మికులకు అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం పెందుర్తి ఏరియా కార్యదర్శి బి.రమణి, సీపీఐ ఎంఎల్‌డీ నాయకురాలు కె.నిర్మల, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుల ఆర్.శ్రీనివాసరావు, విమల, ఎస్‌కే.రెహమాన్, కె.సత్యనారాయణ, రాంబాబు, కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఆదిరెడ్డిపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బృంద సభ్యురాలు లక్ష్మి తదితరులు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషన్ బృందం సోమవారం పరిశీలించింది. ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో బృందం సభ్యులు జేవీ సునీల్, క్లస్టర్ ఏపీడీ మణికుమార్ సబ్బవరం పంచాయతీ పరిధిలోని ఆదిరెడ్డిపాలెంలో చేపడుతున్న మట్టిరోడ్డు పనులు,అమృతపురంలో రింగ్ ట్రెంచ్ పనులను,అసకపల్లిలోని చెరువు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంత వేతనం గిట్టుబాటు అవుతుందనే దానిపై ఆరా తీశారు. అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలని, అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడుతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు,సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జిగా కోటి అప్పారావు



అప్పారావును అభినందిస్తున్న సామ్రాట్ కుమార్ తదితరులు

సబ్బవరం: మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా ఆరిపాక శివారు చినయాతపాలెం గ్రామానికి చెందిన మారెడుపూడి కోటి అప్పారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జి. సామ్రాట్ కుమార్,దళిత నాయకులు కొమ్ము కోటి,నీటిపల్లి ముత్యాలరావు,పోలయ్య,చంద్రరావు,శివాజీ తదితరులు అభినందించారు. కోటి అప్పారావు మాట్లాడుతూ దళితుల హక్కుల సాధన కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సంఘటన స్థలంలో మృతుడు సాయికుమార్

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ దబ్బందకు చెందిన లంక సాయికుమార్(22) కొత్తవలస నుంచి పెందుర్తి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. సరిపల్లి బ్రిడ్జి వద్ద బైకు అదుపుతప్పి తప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ..



మొండెం నుంచి తెగి పడిన మహిళ తల

పరవాడ: తాడి రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని దువ్వాడ రైల్వే పోలీసులు శనివారం కనుగొన్నారు. మృతురాలి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చునని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వస్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి గురైన మహిళ గులాబీ రంగు డ్రెస్, చున్నీ ధరించి ఉందని ముందు పన్ను లేదని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9440627547 నంబరుకు సమాచారం తెలియజేయాలని సీఐ కోరారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు వృత్తి నైపుణ్య శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్

మద్దిలపాలెం: విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయడానికి వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మహారాజ ప్రభుత్వ సంస్కృతిక కళాశాల అధ్యాపకుడు డాక్టర్.పి.అనిల్‌కుమార్ అన్నారు. మద్దిలపాలెంలో నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభమైన రెండో దశ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు చేశారు. కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 25వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వృత్తి కోర్సుల్లో నైపుణ్యం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, నోడల్ రిసోర్స్ కో ఆర్డినేటర్ పి.వాణి, మాస్టర్ ట్రైనర్స్ రాజశేఖర్ సి.హెచ్.వి.సాయికృష్ణ, గీతాంజలి, శంకర్, పోలా ఉమామహేశ్వరరావు, 12 కళాశాలల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

29న ఫుట్‌బాల్ శిక్షణకు ఎంపికలు

బీచ్ రోడ్డు: దాకమర్రిలోని కందుకూరి క్రికెట్ అకాడమీలో రెసిడెన్షియల్ అకాడమీలకు ఫుట్‌బాల్ శిక్షణతో కూడిన బోర్డింగ్ స్కూల్స్ ట్రయల్స్ ఈ నెల 29న నిర్వహించనున్నట్టు బైచుంగ్ భూటియా ఫుట్‌బాల్ పాఠశాల ప్రతినిధి కిషోర్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో ఫుట్‌బాల్ శిక్షణ ఎంపిక వివరాలను సోమవారం ఆయన విలేకరులకు వివరించారు. ఈ ట్రయల్స్ రెండు దశల్లో ఉంటాయన్నారు. మొదటి దశలో ప్రాంతీయ స్థాయి, తర్వాత జాతీయ స్థాయిలో ఎంపిక ఉంటుందన్నారు. క్రీడాకారులు ఐడీ కార్డుతో పాటు ఫుట్‌బాల్ కిట్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 75749 80867 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

అందుబాటులో లింగ నిర్ధారిత వీర్య నాళికలు

మధురవాడ: పెయ్య దూడల ఉత్పత్తి పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ పాడి రైతులకు అందిస్తున్న లింగ నిర్ధారిత వీర్య నాళికలు మధురవాడ పశువైద్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వైద్యుడు అరుల్ సోమవారం చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ 500 డోసులు అందుబాటులో ఉంచామని, ఆసక్తి గల పాడి రైతులు సంప్రదించాలని కోరారు. ముర్రా, జెర్సీ, హెచ్‌ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్‌ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ జాతులకు చెందిన లింగ నిర్ధారిత వీర్య నాళికలు ఉన్నాయన్నారు. రెండు వీర్య నాళికల ధర రూ.1350 కాగా ప్రభుత్వం రూ.850 సబ్సిడీ ఇస్తుందని, రైతులు రూ.500 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండు ప్రయత్నాల్లో పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం తిరిగి ఇచ్చేస్తామన్నారు. పాడి రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏయూ ఇంజినీరింగ్ కళాశాల విభాగాల పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో పలు విభాగాలను రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం పరిశీలించారు. విభాగాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పారిశుద్య సిబ్బందిని ఆదేశించారు. విభాగాధిపతులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. పారిశుద్య లోపాలు లేకుండా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా విభాగ పరిసరాలు తీర్చిదిద్దాలని ఆమె సూచించారు.

సైకిళ్లు, కుట్టు మిషన్ల అందజేత



కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సహకారంతో రూ.4 లక్షల వ్యయంతో సమకూర్చిన సైకిళ్లు, కుట్టు మిషన్లను విద్యార్థులు, మహిళలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మిశ్రీనివాసరావు పిలుపునిచ్చారు. యుటిలిటీ పవర్ టెక్ లిమిటెడ్‌లో భాగంగా సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం 9 తరగతి విద్యార్థినులు, డ్వాక్రా మహిళలకు సైకిళ్లు, కుట్టు మిషన్లను సోమవారం జెడ్పీ బాలికల పాఠశాలలో అందజేశారు. 9వ తరగతి విద్యార్థినులకు 20 సైకిళ్లు, డ్వాక్రా మహిళలకు 16 కుట్టు మిషన్లు ఎంపీపీ పంపిణీ చేశారు. సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, యూపీఎల్ ఆర్‌ఎం అరుణ్ ప్రమాణిక్, ఫైనాన్స్ హెచ్‌వోడీ అనంత్‌షా, హెచ్ఆర్ అనిల్‌కుమార్‌సాహు, సీ అండ్ ఎం బిశ్వాస్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు సన్నాహాలు



కప్పస్తంభానికి మొక్కు కుంటున్న విజయలక్ష్మి దంపతులు

సింహాచలం : సింహగిరిపై లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం విజయలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి సింహగిరిపై లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకి పీఆర్‌వో కార్యాలయం వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. సంబంధిత విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకి కేంద్ర ప్రభుత్వం నుంచి 75 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 25 శాతం నిధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో విజ యలక్ష్మి భర్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీ హెచ్‌డీసీ డైరెక్టర్ పైడి రమణ, విశాఖపట్నం లేపాక్షి ఎంపోరియం సిబ్బంది దయానంద కుమార్, దేవస్థానం పీఆర్‌వో నాయుడు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో 18 ఏళ్లు దాటిన నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు ఎంపీడీవో హేమసుందర్రావు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు చెప్పారు.

అర్హతలు.. శిక్షణ ఇలా

దరఖాస్తు చేయడానికి అభ్యర్థి వయస్సు 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి. 10 తరగతి పాసై ఉండాలి.ఆర్నెల్ల పాటు శిక్షణ ఇస్తారు. దీని కోసం 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఓబీసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వారికి వయస్సు సడలింపు ఉంటుందన్నారు. యువతి యువకులకు వేర్వేరుగా నివాసం, భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అత్యాధునిక ప్లాస్టిక్ తయారీ యంత్రాలపై సుశిక్షితులైన ఫ్యాకల్టీలతో బోధన, శిక్షణ ఉంటుందని చెప్పారు. మెషీన్ ఆపరేటర్-ప్లాస్టింగ్ ప్రాసెస్సింగ్, మెషీన్ ఆపరేటర్-ఇంజెక్షన్ మౌల్డింగ్ కోర్సుల్లో చేరదల్చుకున్న అభ్యర్థులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న శిబిరంలో దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. సింహాద్రి ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామాలు, పరిసర గ్రామాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. విజయవాడలో నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో భాగంగా నెలకు రూ.3 వేలు స్టైఫండ్ కల్పిస్తారన్నారు.

జయహో జనగణమన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఈ నెల 24 ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్న జయహో జనగణమన వారోత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జనగణమన గీతాలాపన ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయ గీతంగా ఆమోదించి జనవరి 24కు 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు జిల్లాలో జనగణమన గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ముగింపు కార్యక్రమం ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య కె.పల్లవి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జనగణమన-రవీంద్రనాథ్ ఠాగూర్ అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గొల్ల ప్రదీప్‌రాజ్, మహమ్మద్ ఇషాక్, నరేష్, కొయ్య రామకృష్ణ, సుధాకర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.